‘ప్రార్థనా మందిరాల అభివృద్ధికి సహకారం ఉంటుంది’


బ్యాంక్‌కాలనీలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రార్థనా మందిరాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం చంద్రగిరినగర్‌లో పాస్టర్స్ జాకబ్స్ ఆధ్వర్యంలో నిర్మించిన ప్రేయర్ పవర్ చర్చిని గురువారం ఎమ్మెల్యే వివేకానంద్, బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, గోవర్ధన్ రెడ్డి, సుంకరి చందు ముదిరాజ్, నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

◆ జీడిమెట్ల డివిజన్ బ్యాంక్ కాలనీలోని శ్రీసాయి సహిత హనుమాన్, శివలింగ దేవాలయంలో నిర్వహించిన సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్దిరాములు, నరేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, సమ్మయ్య నేత, కాలే నాగేష్, కాలే గణేష్, ఎల్లాగౌడ్, విజయ్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



శ్రీరామ్‌నగర్-ఏ లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

సుభాష్‌నగర్: వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు తీరుస్తాయని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గురువారం గాజులరామారం శ్రీరామ్ నగర్-ఏ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. వాహనదారుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాల ఏర్పాటుకు సంక్షేమ సంఘాలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో దండే రాజు, హర్బజన్ సింగ్, రాజారెడ్డి, మహమ్మద్ అన్వర్, సంజయ్ కుమార్, తిరుపతి యాదవ్, నర్సింగ్‌రావు, అమర్నాథ్, మహేందర్, ప్రకాష్, గడ్డం వెంకటేష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనజాతర బహిరంగ సభను విజయవంతం చేయాలి


విన్ ఫ్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న హన్మంతరెడ్డి

సుభాష్‌నగర్: తుక్కుగూడలో జరిగే జనజాతర బహిరంగ సభను విజయవంతం చేయాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. గురువారం గాజులరామారం విన్ ఫ్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 6న జరిగే జనజాతర సభ నేపథ్యంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హన్మంతరెడ్డి మాట్లాడుతూ... ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, జాతీయ నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు హాజరయ్యే ఈ సభలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను విడుదల చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సర్సారెడ్డి భూపతిరెడ్డి, పున్నారెడ్డి, ఏబ్లాక్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు జేమ్స్, బండి శ్యామ్‌గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రులు


ఓఘ వెల్నెస్ సెంటర్ ప్రారంభోత్సవంలో సైకిల్ తొక్కుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

గచ్చిబౌలి: ఒకే వేదికపై యోగ, జిమ్, వెల్నెస్ సెంటర్‌ను ‘ఓఘ వెల్నెస్’ పేరిట అందుబాటులోకి తీసుకొచ్చారు. గచ్చిబౌలిలో గురువారం రాష్ట్ర రోడ్ల భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓఘ వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఐటీ ఉద్యోగులకు ఇలాంటి కేంద్రాల ద్వారా ఒత్తిడికి ఉపశమనం అని ఓఘ వెల్నెస్ ఎం.డి. డాక్టర్ సంధ్య పేర్కొన్నారు. ప్రారంభోత్సవంలో మంత్రులతో పాటు సినీ నటి డింపుల్ హయతి, హీరో వెంకట్, గీతా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో మినీ అబ్జర్వేటరీ కేంద్రం ఏర్పాటు


కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు, పూర్వవిద్యార్థులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మినీ అబ్జర్వేటరీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ పూర్వ విద్యార్థుల జ్ఞాపకార్థం దీన్ని ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ విభాగం 1986 పూర్వ విద్యార్థి డాక్టర్ నందివాడ రత్నశ్రీ పేరు మీద మినీ అబ్జర్వేటరీని ఏర్పాటు చేశారు. ఆమె 2021 వరకు న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ ప్లానిటోరియం డైరెక్టర్‌గా పని చేశారు. ఆతర్వాత కోవిడ్ సమస్యలతో ఆమె మృతి చెందారు. దీంతో స్కూల్ ఆఫ్ ఫిజిక్స్ కొత్త భవనం టెర్రస్‌పై మినీ అబ్జర్వేటరీని ఏర్పాటు చేశారు. దీన్ని హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు చేతుల మీదుగా బుధవారం రాత్రి ప్రారంభించారు.పూర్వ విద్యార్థి డాక్టర్ నందివాడ రత్నశ్రీ జ్ఞాపకార్థం ఈ అబ్జర్వేటరీకి పేరు పెట్టారు.

స్నేహితుల దాడిలో వ్యక్తి మృతి

జీడిమెట్ల: స్నేహితుల దాడిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన హాన్స్(38) మరో ముగ్గురు స్నేహితులతో కలిసి అయోధ్య నగర్‌లో ఉంటున్నాడు. వీరంతా వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్నారు. కాగా హాన్స్ బుధవారం స్నేహితులతో కలిసి పక్క గదిలో మద్యం సేవించాడు. అనంతరం ఇద్దరు స్నేహితులతో హాన్స్‌కు గొడవ జరగడంతో వారు అతన్ని కొట్టి పారిపోయారు. దెబ్బలు తాళలేక హాన్స్ మృతి చెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వారు ఉంటున్న గదిలో ఉన్న మరో స్నేహితుడు వినయ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. కొట్టి పారిపోయిన ఇద్దరు దొరికితే తప్ప విషయం తెలియదని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

దుండిగల్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్‌కు చెందిన హితేష్ పటేల్ గండిమైసమ్మ చౌరస్తా సమీపంలో నర్మదా డోర్స్ పేరుతో దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. కాగా ఎప్పటి లాగే ఈనెల 3వ తేదీన దుకాణాన్ని తెరిచేందుకు వచ్చాడు. అదే సమయంతో అక్కడ ఓ వ్యక్తి అచేతనంగా పడి ఉండడాన్ని చూసి 108కు ఫోన్ చేశాడు. అంబులెన్స్ సిబ్బంది అక్కడికి చేరుకుని చూసేసరికి అప్పటికే మృతి చెందాడని ధృవీకరించారు. విషయాన్ని పోలీసులకు సమాచారం అందించగా శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడు భిక్షాటన చేస్తు జీవిస్తుంటాడని, మృతుడి వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈవీ.. ప్రచారం ఏదీ?

- ఎలక్ట్రికల్ వాహనాల చార్జింగ్ స్టేషన్లు ఉన్నా తెలియని వైనం
- యాప్‌లో లొకేషన్ చూసుకుని చార్జింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి
- సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తే ఇతరులు తెలుసుకునే అవకాశం


కుత్బుల్లాపూర్ చౌరస్తాలోని హెచ్ఎంటి సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఈవీ స్టేషన్


ఈవీ స్టేషన్ వద్ద పొదలు ఉన్న దృశ్యం

రంగారెడ్డినగర్: తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ఆర్ఈడీసీఓ) ఆధ్వర్యంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా ఎలక్ట్రిక్ వాహనాల వాడుకను పెంపొందించడానికి ఏర్పాటు చేస్తున్న ఈవీ చార్జింగ్ స్టేషన్లకు ప్రచారం కరువైంది. జాతీయ రహదారులు, ప్రధాన రహదారుల వెంబడి మొత్తం 150 స్టేషన్లను జీహెచ్ఎంసీ సౌజన్యంతో నగర వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. దీంతో జీహెచ్ఎంసీకి ఆదాయం సమకూరడంతో పాటు పర్యావరణానికి మేలు కలుగనుంది. అయితే చాలా ప్రాంతాల్లో అసలు ఈవీ స్టేషన్లు ఉన్నాయా అన్నది ఈవీ వాహనదారులకు తెలియడం లేదు.

◆ కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని హెచ్ఎంటీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో 60 కిలోవోల్ట్‌ల శక్తిసామర్థ్యం ఉన్న ఈవీ చార్జింగ్ స్టేషన్‌ను రెండు నెలల క్రితం నెలకొల్పాయి. అదే విధంగా సుచిత్ర సమీపంలోని జాతీయ రహదారిపై మరో స్టేషన్‌ను అందుబాటులోకి తెచ్చారు.

◆ అయితే ఇక్కడ ఈవీ స్టేషన్ ఉన్నట్లు బోర్డు గాని, ప్రచారం గాని లేదు. దీంతో ఈవీ స్టేషన్లకు సంబంధించి యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకున్న వారికే తప్ప మిగతా ఈవీ వాహనదారులకు అసలు హెచ్ఎంటీ సబ్‌స్టేషన్‌లో ఈవీ స్టేషన్ ఉన్న విషయం తెలియదు. అది కూడా చెట్ల పొదల మాటును కనిపించని విధంగా ఏర్పాటు చేశారు.

అధికారుల వద్ద సైతం ఈవీ స్టేషన్ల వివరాలు లేవు..

◆ గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో టీఎస్ఆర్ఈడీసీఓ, జీహెచ్ఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు ఈవీ స్టేషన్లకు సంబంధించి సర్కిల్ అధికారులకు సమాచారం లేకపోవడం గమనార్హం.

◆ ఈవీ స్టేషన్లకు ప్రచారం కల్పిస్తే జీహెచ్ఎంసీకి అదనపు ఆదాయం సమకూరడంతో పాటు మరిన్ని ఈవీ స్టేషన్లను నెలకొల్పే అవకాశముంది. స్థానికంగా ఈవీ స్టేషన్లపై ప్రచారం కల్పిస్తే మరింత మంది ఈవీ వాహనాలను కొనుగోలు చేసే అవకాశం లేకపోలేదు.

◆ చాలా మంది స్థానికంగా ఈవీ చార్జింగ్ స్టేషన్లు లేవనే కారణంగా ఎలక్ట్రిక్ కార్లు, వాహనాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపడం లేదన్నది బహిరంగ రహస్యం. పర్యావరణానికి మేలు చేకూర్చే ఈవీ స్టేషన్లపై ప్రధాన చౌరస్తాల్లో ప్రచార బోర్డు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది..


హెచ్ఎంటీ సబ్‌స్టేషన్‌లో కనిపించని విధంగా ఉన్న ఈవీ స్టేషన్

కిలోవోల్ట్‌కు రూ.12.06..

◆ ఈవీ స్టేషన్లలో కార్లను చార్జింగ్ చేయడానికి కిలోవోల్ట్‌కు రూ.12.06 ఖర్చవుతుంది. ఈవీ కారు ఫుల్‌చార్జింగ్ చేయడానికి 25 యూనిట్లు అవసరమవుతుంది. ఒక్కో వాహనానికి 300 రూపాయలు వెచ్చిస్తే సరిపోతుంది. చార్జింగ్ సైతం వేగంగా జరిగేలా ఈవీ స్టేషన్ల వద్ద పాయింట్లను ఏర్పాటు చేశారు. దీంతో పర్యావరణ సమతుల్యతో పాటు డబ్బు ఆదా అవుతుంది. ఈవీ స్టేషన్లపై ప్రచారం కల్పిస్తే ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు మరింత పెరిగే అవకాశముంది.

కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలి


సునీతామహేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీరేష్‌గుప్తా

జీడిమెట్ల: మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సంగం వీరేష్‌గుప్తా, కార్యకర్తలతో కలిసి ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టుదలతో కృషి చేసి మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాన్ని గెలిపించాలని కోరారు. ఆమెను కలిసిన వారిలో ఉప్పల సంతోష్, రవి, వెంకటేష్, జగదీష్, శివరామకృష్ణా, ప్రకాష్, సందీప్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రేశ్మంత్‌రెడ్డి, జీవన్, ఉమైర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ లో టెక్ స్టార్టప్ కోహోర్ట్ ప్రారంభం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లో టెక్ స్టార్టప్ కోహోర్ట్‌ను గురువారం పారంభించారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ), రాయల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్ సంయుక్తంగా యూకే కోసం టెక్ స్టార్టప్ కోహోర్ట్‌ను ప్రారంభించడం విశేషం. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల డొమైన్‌లలో 8 స్టార్టప్‌లు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో భారతదేశంలో మార్గదర్శకత్వం, యూకేలోని అవకాశాలు, పెట్టుబడిదారుల అన్వేషించుకోవడానికి దోహదపడుతుంది. సీఐఈ యూకే ప్రోగ్రామ్‌కు భారతీయ భాగస్వామిగా వ్యవహరిస్తుంది.

న్యాక్‌కు అచీవ్‌మెంట్ అవార్డ్ ఫర్ కన్‌స్ట్రక్షన్


అవార్డును అందుకున్న న్యాక్ డైరెక్టర్ శాంతిశ్రీ

మాదాపూర్: మాదాపూర్‌లోని న్యాక్ (నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్) విశ్వకర్మ అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా అచీవ్‌మెంట్ అవార్డు ఫర్ కన్‌స్ట్రక్షన్ అవార్డును న్యాక్ అందుకుంది. నిర్మాణ పరిశ్రమ అభివృద్ధి మండలి ప్రణాళిక సంఘం (సీఐడీసీ) 15వ అవార్డుల కార్యక్రమంలో భాగంగా న్యాక్‌కు అందించింది. 2023-24 లో 27,532 మందికి నిర్మాణ సంబంధిత శిక్షణా కార్యక్రమాలను నిర్వహించినందుకు ఈ అవార్డును అందజేశారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థికి చాణక్య ఫెలోషిప్


జ్యువెల్ బెన్నీ

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ పరిశోధక విద్యార్థి జ్యువెల్ బెన్నీకి మాస్ హెల్త్ కేర్ మానిటరింగ్ సొల్యూషన్ కోసం చాణక్య ఫెలోషిప్‌ను గెలుచుకున్నారు. ఒకేసారి బహుళ రోగుల హృదయ స్పందన రేటు, శ్వాసరేటును గుర్తించడం గురించి ఆలోచించేలా చేశారు.రాడార్ ఆధారిత మాస్ మానిటరింగ్ సిస్టమ్‌ను అండర్ గ్రాడ్యుయేట్ ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ పరిశోధకుడు జ్యువెల్ బెన్నీకి అవకాశం లభించింది.అతనికి ఐహబ్ అనుభూతి ట్రిపుల్‌ఐటీ ఢిల్లీ ఫౌండేషన్ అందించే చాణక్య ఫెలోషిప్‌ను పొందడంలో సహాయపడింది.

కుత్బుల్లాపూర్‌లో నీటి ఎద్దడి లేదు

రెవెన్యూ సీజీఎం ఎం.శ్రీధర్‌రెడ్డి


అధికారులతో సమావేశమైన రెవెన్యూ సీజీఎం ఎం.శ్రీధర్‌రెడ్డి

చింతల్: ఈ వేసవిలో కుత్బుల్లాపూర్‌లో నీటి ఎద్దడి లేదని రెవెన్యూ సీజీఎం సీజీఎం, కుత్బుల్లాపూర్ జీఎం ఎం.శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ వాటర్‌వర్క్స్ కార్యాలయంలో డీజీఎంలు, వివిధ సెక్షన్ మేనేజర్లతో కుత్బుల్లాపూర్‌లో కొనసాగుతున్న నీటి సరఫరాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత వేసవి కంటే ఈ వేసవిలో నీటి డిమాండ్ పెరిగిందన్నారు. అయినా ఈ వేసవికి సరిపడా నీటిని పెంచుకున్నామని అన్నారు. గతేడాది కుత్బుల్లాపూర్ డివిజన్‌కు 22.36 ఎంజీడీల నీటిని అందించగా ఈ ఏడాది అదనంగా మరో 1.64 ఎంజీడీల నీటిని సమకూర్చినట్లు పేర్కొన్నారు. గతేడాది 82వేల నీటి కనెక్షన్లు ఉండగా ఈ సంవత్సరం 10 సెక్షన్లలో కలిపి సుమారు 83200 కనెక్షన్లు పెరిగినట్లు సీజీఎం శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు రాజేష్, అప్పలనాయుడు, విష్ణుప్రసాద్, మేనేజర్లు శివప్రసాద్, రవి, పూజిత, ఝాన్సీ, రోహిణి, రమ్యభారతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ విద్యార్థులు



రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ) విద్యార్థుల బృందం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం కలిసింది. నగరంలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూ ఎన్ఎస్‌యూఐ విభాగం నాయకులు కలిశారు. సీఎం చేతుల మీదుగా ఉగాది పర్వదిన వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరింప చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ హెచ్‌సీయూ ఇన్‌చార్జ్ అజయ్, అధ్యక్షుడు నేహ జయరాజ్, కోఆర్డినేటర్ పట్లోళ్ళ శ్రీరామ్‌యాదవ్, షరీఫ్, రచన, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం-పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తాం

‘మనూ’ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్



రాయదుర్గం: విద్యారంగం-పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ఐనుల్ హసన్ పేర్కొన్నారు . ‘జష్న్-ఏ-బహారన్’ ఉత్సవాల్లో భాగంగా గురువారం యూనివర్సిటీలో చివరి సెమిస్టర్ చదివే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా జాబ్ ఫెస్ట్‌ను నిర్వహించారు. ఈ ఫెస్ట్‌ను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఉర్దూ విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థులందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. చివరి సెమిస్టర్ విద్యార్థులు వృత్తిపరమైన రంగంలోకి సజావుగా మారడానికి జాబ్‌ఫెస్ట్ కీలకమైన వేదికగా ఉపయోగపడాలనే లక్ష్యంతో ఈ ఫెస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. జాబ్‌ఫెస్ట్‌లో 150 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ, ఐఎస్‌టీపీ ఎస్‌బీ-ఆర్ఏఎస్‌ల మధ్య ఎంఓయూ


ఎంఓయూ పత్రాలను మార్చుకుంటున్న దృశ్యం

బంజారాహిల్స్: కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ, రష్యాకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోలార్-టెరెస్ట్రియల్ ఫిజిక్స్ ఆఫ్ ది సైబీరియన్ బ్రాంచ్ ఆఫ్ రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఐఎస్‌టీపీ ఎస్‌బీ-ఆర్ఏఎస్)తో పలు కీలకాంశాలపై ఎంఓయూ కుదుర్చుకున్నాయి. గురువారం ఇరు సంస్థల ప్రతినిధులు ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. అయానోస్పిరిక్ ఫిజిక్స్, స్పేస్ వెదర్ డొమైన్‌లలో శాస్త్రీయ, విద్యాపరమైన సహకారాన్ని అందించే దిశగా ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ మాట్లాడుతూ... ఈ భాగస్వామ్యం యూనివర్సిటీకి ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. గ్లోబల్ అకడమిక్ ఎక్సలెన్స్‌ను ప్రోత్సహించడానికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. తద్వారా ఆవిష్కరణల వైపు ముందుకు నడిపిస్తుందన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఐఎస్‌టీపీ ఎస్‌బీ-ఆర్ఏఎస్‌తో ఉన్న తమ బంధాన్ని మరింత బలోపేతం కాగలదన్నారు.

చిత్తారమ్మ ఆలయానికి 10కిలోల వెండి అందజేత


వెండిని అందజేస్తున్న పుప్పాల నర్సింగ్‌రావు

కుత్బుల్లాపూర్: గాజులరామారంలోని శ్రీచిత్తారమ్మ ఆలయ వెండి ముఖద్వారానికి భక్తుడు పుప్పాల భాస్కర్‌రావు గురువారం ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్‌కు 10 కిలోల వెండిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాలరాజ్, బీఆర్ఎస్ సూరారం డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం


డ్రైనేజీ వేసేందుకు సిద్ధంగా ఉన్న పైపులు

జగద్గిరిగుట్ట: గాజులరామారం డివిజన్ లెనిన్‌నగర్‌లో ఎప్పటి నుంచో ఉన్న డ్రైనేజీ సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. కొంత కాలంగా డ్రైనేజీ సమస్యతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా ఇటీవల రూ.40 లక్షలతో నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. అందులో భాగంగా పైపులైన్లను సిద్ధం చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థల యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తికి సంబంధించిన స్థలంలో ఆలయం ఏర్పాటు విషయంపై ఫిర్యాదు అందడంతో పేట్‌బషీరాబాద్ పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కుత్బుల్లాపూర్ నుంచి సుచిత్రకు వెళ్లే రోడ్డులో ఉన్న హనుమాన్ గుడి వెనుక భాగంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ చేపడుతుండగా స్థల యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముద్దాపురం ప్రభాకర్‌గౌడ్, శివ, కృష్ణవేణిలపై కేసు నమోదు చేశారు. గతంలో ఈ స్థలం వివాదంలో ఉండగా కోర్టులో కేసు కొనసాగుతోంది.

అక్రమ షెడ్డు కూల్చివేత


అక్రమ షెడ్డును కూల్చివేస్తున్న దృశ్యం

దుండిగల్: అనుమతులు లేకుండా చేపట్టిన ఆక్రమణలపై దుండిగల్ మున్సిపల్ అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే పలువురికి నోటీసులు సైతం జారీ చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేటలోని సర్వే నెంబరు 172, 238లో నూతనంగా నిర్మిస్తున్న భారీ షెడ్డును గురువారం కూల్చివేశారు. మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ అధికారి సంజున ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

కుత్బుల్లాపూర్: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా రూ. 52,500 విలువ చేసే మద్యాన్ని తీసుకువెళుతున్న వ్యక్తిని ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేసి పేట్‌బషీరాబాద్ పోలీసులకు అప్పగించారు. జీడిమెట్ల సమీపంలో ఉన్న ఓ వైన్ షాప్ నుంచి ఏకంగా రూ.50వేలకు పైచీలుకుగా మద్యం బాటిళ్లను తీసుకువెళుతున్నట్లు గుర్తించిన స్పెషల్ ఆపరేషన్ టీమ్ పోలీసులు పట్టుకున్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత


రోడ్డుపైకి వచ్చిన అక్రమ నిర్మాణం

జగద్గిరిగుట్ట: రోడ్డును ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. గాజులరామారం సర్కిల్ జగద్గిరిగుట్ట డివిజన్ మైసమ్మనగర్ ఏ బ్లాక్‌లోని రోడ్డు నెంబరు 4లో ఓ వ్యక్తి తన ఇంటి ప్రహరీ నుంచి రోడ్డుకు 10 ఫీట్లు జరిగి నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. నిర్మాణాన్ని తొలగించాలని స్థానికులు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని స్థానికులు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు.

రియాక్టర్ మీద పడి కార్మికుడు మృతి

జీడిమెట్ల: క్రేన్ సహాయంతో రియాక్టర్‌ను అదుపు చేస్తుండగా ప్రమాదవశాత్తు రియాక్టర్ మీద పడి ఓ కార్మికుడు మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై హరీష్ వివరాల ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లాకు చెందిన జనార్దన్ నాయుడు(38) జీడిమెట్లలోని బాలాజీ ఇంజనీరింగ్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం 9గంటలకు జనార్దన్ డ్యూటీకి వెళ్లాడు. అక్కడ క్రేన్ సహాయంతో కొత్తగా తయారు చేసిన రియాక్టర్‌ను పైకి ఎత్తారు. రియాక్టర్‌ను జనార్దన్ అదుపు చేస్తుండగా ప్రమాదవశాత్తు రియాక్టర్ అతని మీద పడింది. దీంతో జనార్దన్ తీవ్రగాయాలతో అక్కడికి అక్కడే మృతిచెందాడు. పరిశ్రమ యజమాని పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటాం..

◆ కార్మికుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని పరిశ్రమ యాజమాన్యం తెలిపారు. అతని కుంటుంబానికి తమ వంతు సహాయం చేస్తామని తెలిపారు.

యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానం

శ్రీనగర్‌కాలనీ: సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సర్ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డుల ప్రదానోత్సవం గురువారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆస్కార్ అవార్డు గ్రహీత, సినీ గేయ రచయిత చంద్రబోస్, గాయకుడు సతీష్‌రెడ్డి, మాజీ సైంటిఫిక్ అడ్వైజర్ నికోలయ్ ఫ్రిస్టోవ్ యాంకోవ్‌లు హాజరై విద్యార్థులకు అవార్డులను అందజేశారు. జాతీయ స్థాయిలో 1500 పాఠశాలల నుంచి లక్ష మంది విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు అవార్డులు, రివార్డులను ప్రదానం చేశారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, పేద విద్యార్థులకు అండగా సుచిరిండియా ఫౌండేషన్ ముందుంటుందని ఫౌండేషన్ ప్రతినిధి లయన్ కిరణ్‌కుమార్ తెలిపారు.